## క్లుప్తంగా

### పల్లపు ప్రాంతాలు జలమయం



పట్టణంలోని హౌసింగ్ బోర్డులో వర్షపు నీటితో మునిగిన పల్లపు రోడ్డు

రామచంద్రపురం: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో నియోజకవర్గంలో శనివారం రాత్రి నుంచి ఎడతెరిపి లేని వర్షం కురుస్తోంది. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏకబిగిన వర్షం కురుస్తూనే ఉంది. దీంతో జనజీవనం స్తంభించింది. పల్లపు ప్రాంతాల్లోని రోడ్లు కొన్ని జలమయమయ్యాయి. రాబోయే రెండు మూడు రోజుల పాటు వర్షాలు అధికంగా ఉంటాయని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించడంతో పల్లపు ప్రాంతాలు ముంపునకు గురయ్యే అవకాశాలు అధికంగా ఉంటాయి. దీంతో అధికారులు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. గత రాత్రి నుంచి ఎడతెరిపి లేని వర్షాల కారణంగా రామచంద్రపురం పట్టణంలో పల్లపు ప్రాంతాల్లోని రోడ్లు జలమయమయ్యాయి. ప్రస్తుతం ఖరీఫ్‌లో రైతులు నాట్లు వేసి సుమారుగా 35 నుంచి 28 రోజులు కావస్తోంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల మూలంగా వరి పంటలను మునిగిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తునారు. రాబోయే 48 గంటల పాటు వర్షాలు ఇలాగే కురిస్తే రైతులకు నష్టం తప్పదని అంచనా వేస్తున్నారు.

### క్రమంగా తగ్గుతున్న గోదావరి



కోటిపల్లి రేవులో నాలుగడుగుల మేర తగ్గి ప్రవహిస్తున్న గోదావరి

కె.గంగవరం: కాటన్ బ్యారేజీ వద్ద మిగులు జలాలను సముద్రంలోకి వదలడం వల్ల మండలంలోని కోటిపల్లిలో వరద ఉధృతి పెరిగింది. అయితే శనివారంతో పోలిస్తే ఆదివారం ఉదయం నుంచి క్రమంగా గోదావరి తగ్గుముఖం పట్టిందని స్థానికులు చెబుతున్నారు. సాయంత్రానికి రేవు వద్ద రెండు అడుగుల మేర వరకు ఉధృతి తగ్గిందని వారు చెప్పారు. ఉధృతి ఇంకా కొనసాగడంతో పంటు ప్రయాణాన్ని రెవెన్యూ అధికారులు నిలిపి వేశారు. ఉధృతి పూర్తిగా తగ్గిన తరువాత ముక్తేశ్వరం వైపు కంకర రహదారి నిర్మించిన అనంతరం రాకపోకలు కొనసాగిస్తామని అధికారులు చెప్పారు.

### క్యాన్సర్‌పై పీఎంపీలు అవగాహన కల్పించాలి



గొల్లపాలెంలో క్యాన్సర్ వ్యాధులపై కరపత్రాలు ప్రదర్శిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

కాజులూరు: క్యాన్సర్ వ్యాధులపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు పీఎంపీలు కృషి చేయాలని కమ్యూనిటీ పారామెడికల్స్, ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తోరాటి ప్రభాకరరావు అన్నారు. ఆదివారం ప్రపంచ క్యాన్సర్ నివారణ దినోత్సవం పురస్కరించుకుని గొల్లపాలెం పీఎంపీ సామాజిక భవనంలో సంఘం మండల శాఖ అధ్యక్షుడు జేవీవీ సూర్యనారాయణ అధ్యక్షతన క్యాన్సర్ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో కాకినాడ లైఫ్‌లైన్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు జి.భానుమతి, కె.శ్రీహర్ష, స్థానిక శ్రీరామా నర్సింగ్‌హోం అధినేత సత్తి శ్రీరామారెడ్డి, డాక్టర్ సత్తి సుమనశ్రీ తదితరులు మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధులను గుర్తించే విధానం, క్యాన్సర్ వ్యాధులను నిర్మూలించే హెచ్‌వి వ్యాక్సిన్, శస్త్ర చికిత్స విధానాలపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సంఘం కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ జిల్లా అధ్యక్షుడు కేఎస్ ప్రసాద్, బళ్ళా శ్రీనివాసరావు, కోన సత్యనారాయణ, జిల్లా గౌరవాధ్యక్షుడు కోన చిన్నారావు, రాష్ట్ర ముఖ్య సలహాదారు కేఎస్ఎన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

### జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక



శశిరేఖ, ధరణి

రాజోలు: జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు రాజోలుకు చెందిన వై.శశిరేఖ, సీహెచ్ ధరణిలు ఎంపికయ్యారని తైక్వాండో కోచ్ ఆర్.మణికుమార్ ఆదివారం తెలిపారు. గత నెల విజయనగరంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన వీరు ఇరువురు ఈ నెల 8, 9, 10 తేదీల్లో ఆగ్రాలో జరిగే 12వ సబ్ జూనియర్ తైక్వాండో పోటీల్లో పాల్గొంటారని వివరించారు. రాజోలు బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో తైక్వాండోలో శిక్షణ ఇచ్చామన్నారు. ముదునూరి అక్కిరాజు చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు ముదునూరి లతేంద్రవర్మ, నాయకుడు దేవళ్ల వెంకటరమణ తదితరులు జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను అభినందించారు.

# కొలువుదీరిన గణనాథులు

- వైభవంగా వినాయక చవితి వేడుకలు
- గ్రామాల్లో ప్రత్యేక పూజలు



ద్రాక్షారామ భీమేశ్వరాలయ ప్రాంగణంలో చవితి పూజలందుకుంటున్న దుండి గణపతి

రాయవరం: విఘ్నాలు తొలగించి తమను ఆదుకోవాలంటూ భక్తులు గణనాథుడిని మనసారా కొలిచారు. చవితి వేడుకలను శనివారం భక్తులు ఘనంగా నిర్వహించారు. వాడవాడలా పలుచోట్ల వినాయక మంటపాలు వెలిశాయి. అదనపు ఆకర్షణగా పలుచోట్ల విద్యుత్ దీపాలంకరణ చేశారు. మంటపాల్లో పురోహితులు వినాయకుని వ్రతం విశిష్టతను, వ్రత కథను భక్తులకు వివరించారు. మంటపాల్లో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వర ప్రతిమలను గ్రామాల్లో ఊరేగించారు. రాయవరం, వెదురుపాక, వి.సావరం, లొల్ల, నదురుబాద, సోమేశ్వరం, మాచవరం, పసలపూడి, చెల్లూరు, వెంటూరు, కూర్మాపురం, కురకాళ్లపల్లి గ్రామాల్లో చవితి వేడుకలను భక్తులు ఆనందోత్సాహాలతో, భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. మండలంలోని 12 గ్రామాల్లో 68 కూడళ్లలో వినాయక మంటపాలు ఏర్పాటు చేశారు. ఆయా మంటప కమిటీల ప్రతినిధులతో రాయవరం ఎస్సై పి.బుజ్జిబాబు సమావేశాన్ని నిర్వహించారు. ప్రతి మంటపం వద్ద ఇరువురు వ్యక్తులు 24/7 ఉండాలన్నారు. నిమజ్జనం చేసే తేదీని, ప్రదేశాన్ని ముందుగానే పోలీసులకు తెలియజేయాలన్నారు.

**విజయదుర్గా పీఠంలో..**

మండలంలోని వెదురుపాక విజయదుర్గా పీఠంలో చవితి వేడుకలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. వినాయక వ్రత విశిష్టతను పీఠాధిపతి వాడ్రేవు వెంకటసుబ్రహ్మణ్యం(గాడ్) భక్తులకు వివరించారు. పీఠం అడ్మినిస్ట్రేటర్ వి.వి.బాపిరాజు, పీఠం ప్రతినిధులు గాదె భాస్కరనారాయణ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

కపిలేశ్వరపురం: మండలంలోని 19 గ్రామాల్లో శనివారం, ఆదివారం గణేశ్ నవరాత్ర ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. వరుసగా రెండు రోజులు సెలవు దినాలు కావడంతో ఉత్సవ శిబిరాల్లో సందడి నెలకొంది. గణపతి ఆలయాలు, ఉత్సవ శిబిరాల్లో ప్రతిష్ఠించిన విగ్రహాల వద్ద పూజలు చేశారు. అంగర, పడమర ఖండ్రిక, కపిలేశ్వరపురం, తాతపూడి, వెదురుమూడి, వల్లూరు, నేలటూరు, నిడసనమెట్ట, వడ్లమూరు, నల్లూరు, అచ్యుతాపురం, కాలేరు, టేకి, మాచర, కోరుమిల్లి, నాగులచెరువు, కోరుమిల్లి, అద్దంకివారిలంక, వాకతిప్ప, కేదారిలంక గ్రామాల్లో చవితి సందడి నెలకొంది. శిబిరాల్లో ఆధ్యాత్మిక, వినోద కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.



అంగర గ్రామంలోని వినాయక శిబిరంలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

**రామచంద్రపురం మండలంలో..**

రామచంద్రపురం రూరల్: వినాయచవితిని పురస్కరించుకుని మండలంలోని గ్రామాల్లో శనివారం, ఆదివారం వినాయకుని పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరాలయంలో కొలువైయున్న దుండి గణపతికి దేవస్థానం ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పాలవెల్లి కట్టి పూజలు నిర్వహించారు. భీమేశ్వరాలయ ప్రాంగణంలో జోగా బ్రదర్స్ ఆధ్వర్యంలో ఏటా మాదిరిగానే అత్యంత సుందరమైన సెట్టింగ్ వేశారు. వెలంపాలెం కంబాల చెరువు వద్ద భారీ వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. తాళ్లపాలెం, వెలంపాలెం, తోటపేట, అన్నాయిపేట, జగన్నాయకులపాలెం, వేగాయమ్మపేట తదితర గ్రామాల్లో వినాయ పందిళ్లు వేసి వినాయక చవితి పండగను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు.

**కె. గంగవరం మండలంలో..**

కె.గంగవరం: మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం వినాయకచవితి వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన తాత్కాలిక గణపతి శిబిరాల వద్ద యువకులు ఉదయాన్నే కొత్తబట్టలు ధరించి పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి విగ్రహానికి ప్రాణ ప్రతిష్ఠ చేశారు. గణపతి నవరాత్రుల కోసం శిబిరాల వద్ద విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. శిబిరాల వద్ద సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. తొమ్మిది రోజుల పాటు శిబిరాల వద్ద ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం నిమజ్జనం చేస్తామని నిర్వాహకులు చెబుతున్నారు.



రాయవరంలో కొలువుదీరిన గణేశుడ్ని పూజిస్తున్న భక్తులు



రాయవరంలో సరులదిమ్మపై కొలువుదీరిన వినాయకుడు



కోటిపల్లి ఒకటో వార్డులో కొలువైన గణపతి

### కన్యకా పరమేశ్వరి గుడిలో పెన్నుల పూజ



గణనాథుని వద్ద పెన్నుల పూజ చేస్తున్న ఆర్యవైశ్యులు

మండపేట: పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం పెన్నుల పూజ నిర్వహించారు. గణపతి నవరాత్ర ఉత్సవాలను పురస్కరించుకుని వాసవీ యూత్ ఆధ్వర్యంలో ఆలయంలో వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. రెండో రోజు ఆదివారం ఆలయ అర్చకుడు సాయి ఆధ్వర్యంలో గరిక పూజ నిర్వహించారు. విద్యార్థులకు సరస్వతీ కటాక్షం కలగాలని కోరుతూ పెన్నుల పూజ చేశారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు గ్రంధి నమశ్శివాయ మాట్లాడుతూ ఏటా మాదిరి నవరాత్రి 2వ రోజు పెన్నులపూజ నిర్విఘ్నంగా నిర్వహించామన్నారు. కార్యక్రమంలో పెరుమాళ్ల మహాలక్ష్మి, తాటికొండ రమేష్, పెరుమాళ్ల రాంబాబు, పెరుమాళ్ల వెంకట సూర్యనారాయణ, వెత్సా మురళీకృష్ణ, గొల్లపూడి రామకృష్ణుడు, కాళ్లకూరి పెద్ద రామారావు, నాళం ఫణీప్రకాష్, బోడా శ్రీకాంత్, బండి ఫణీంద్రకుమార్, నార్కెడుమిల్లి నరేష్, చామర్తి అంజిబాబుతదితరులు పాల్గొన్నారు.

## అర్తమూరు గణనాథునికి వెండి కవచం

అలంకరించిన ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట: అర్తమూరు గ్రామాన్ని శ్రీ సిద్ది విఘ్నేశ్వర స్వామి వారు కాపాడాలంటూ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆకాంక్షించారు. ఈ గ్రామంలో కొలువైన విఘ్నేశ్వర స్వామి వారికి గ్రామానికి చెందిన 50 మంది దాతలు కలిపి ఐదు కిలోల వెండి కవచాన్ని తయారు చేయించారు. ఆదివారం నిర్వహించిన స్వామివారి వెండి కవచం అలంకరణోత్సవంలో ఎమ్మెల్సీ తోట ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన చేతులమీదుగా స్వామివారికి వెండి కవచాన్ని అలంకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ చిన జీయర్‌స్వామి వంటి మహానుభావులు నడయాడిన అర్తమూరు గ్రామం ఎంతో పుణ్యం చేసుకుందన్నారు. అనంతరం స్వామి వారికి ఎమ్మెల్సీ త్రిమూర్తులు ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్సీని దుశ్శాలువాతో ఘనంగా సత్కరించి, వినాయకుని చిత్ర పటాన్ని బహూకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ గొలుగూరి అన్నపూర్ణ, భాస్కరరెడ్డి దంపతులు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, పడాల సుబ్బారెడ్డి, చిర్ల జయరామ్‌రెడ్డి, గొలుగూరి సందీప్‌రెడ్డి, మండ నాగిరెడ్డి, నల్లమిల్లి రామచంద్రారెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ నల్లమిల్లి పెద్దారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అర్తమూరు విఘ్నేశ్వర స్వామికి వెండి కవచాన్ని అలంకరిస్తున్న ఎమ్మెల్సీ తోట

# వరి పంటపై మాగుడు తెగులు

- వాతావరణంలో మార్పులే కారణం
- సకాలంలో నివారణ చర్యలు చేపట్టాలి

రాయవరం: వాతావరణ మార్పు ప్రభావం వరిపంటపై స్పష్టంగా కన్పిస్తోంది. ఇప్పటి వరకూ వరి పంట ఆశాజనకంగానే ఉన్నప్పటికీ, ప్రస్తుతం వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులు తెగుళ్లకు దోహదమవుతున్నాయి. కాగా రైతులు తగిన జాగ్రత్తలు తీసుకుంటే మాగుడు తెగులును నివారించుకునే వీలుంటుంది.

**క్లస్టర్ పరిధిలో..**

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల పరిధిలోని మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం, రామచంద్రపురం, కె.గంగవరం, కాజులూరు మండలాల్లో సుమారుగా 1.01 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ వరిసాగు చేపట్టారు. అక్కడక్కడా మాగుడు తెగులు వరిపంటను ఆశిస్తోంది. సకాలంలో నివారణ చర్యలు చేపట్టకుంటే రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం వరి పంట చిరుపొట్ట దశలో ఉంది.

**శిలీంధ్రమే కారణం**

వరిపంటను మాగుడు తెగులు ఆశించడానికి శిలీంధ్రమే కారణమని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. దీన్నే రైతుల పరిభాషలో పాము పొడ తెగులు అంటారు. గట్ల వెంబడి ఉన్న గడ్డిపై ఈ శిలీంధ్రాలు నివాసం ఉంటాయి. అందుకే ఎప్పటికప్పుడు గట్లను గడ్డిలే కుండా శుభ్రం చేసుకోవాలి. తెగులు గమనించిన వెంటనే గట్లపై కూడా హెక్సాకోనజోల్ రెండు మిల్లీలీటర్లు లేదా వాలిడామైసిన్ రెండు మిల్లీలీటర్ల మందును లేదా ప్రొఫినోకోనోజోల్ ఒక మిల్లీ లీటరు మందును లీటరు నీటికి కలిపి ఎకరాకు 200 లీటర్ల మందు ద్రావణాన్ని పైరు పూర్తిగా తడిచేలా పిచికారీ చేయాలి. వర్షాలు తగ్గిన వెంటనే మందు ద్రావణాన్ని పిచికారి చేసుకుంటే మంచిది. నత్రజని ఎరువులు అధికంగా వాడడం వలన తెగులు ఉధృతి అధికమవుతుంది. 15–20 కేజీలు పొటాష్ ఎరువును ఎకరానికి చల్లుకోవాలి. దీని వలన రోగ నిరోధక శక్తి పెరిగి, గింజలు తోడుకుని అధిక దిగుబడులు రావడానికి దోహదపడుతుంది.



పురుగు మందు పిచికారీ చేస్తున్న కౌలు రైతు (ఫైల్)

**మాగుడు తెగులు కన్పిస్తోంది**



ఖరీఫ్‌లో వరి పంటను మాగుడు తెగులు అక్కడక్కడా ఆశిస్తోంది. నత్రజని ఎక్కువగా వాడిన పొలాల్లో ఇది కన్పిస్తోంది. ఇప్పటికైనా రైతులు నత్రజని వాడకాన్ని తగ్గించాలి. రైతులు విచక్షణా రహితంగా పురుగు మందుల వాడకూడదు. వ్యవసాయ శాఖ సూచనలను పాటించాలి.

– కొప్పిశెట్టి ప్రభాకరరావు, ఏవో, రాయవరం

# సా.... గుతున్న విచారణ

- రెండేళ్లుగా ఇదే తంతు
- సమాచార హక్కు చట్టం ద్వారా వెలుగులోకి..
- దాదాపుగా రూ.30 లక్షలు దుర్వినియోగం
- మీనమేషాలు లెక్కిస్తున్న అధికారులు

రామచంద్రపురం: గ్రామాభివృద్ధికి ఖర్చు చేయాల్సిన ప్రభుత్వ సొమ్ములు నాయకుల జేబుల్లోకి వెళ్లాయి. అడిగేవారు లేరని ఇష్టానుసారంగా తన అనుచరులు, పంచాయతీ ఉద్యోగస్తుల బ్యాంకు ఖాతాల్లోకి జమ చేసి మరీ మింగేసిన వైనం రామచంద్రపురం మండలం వెల్ల పంచాయతీలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఒక వ్యక్తి అనుమానంతో సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలు కోరగా అసలు బాగోతం బయటపడింది. కాగా ఇది తెలిసి రెండేళ్లు గడుస్తున్నా విచారణ చేసి చర్యలు తీసుకోవాల్సిన అధికారులు మీన మేషాలు లెక్కిస్తున్న వైనాన్ని వెల్ల గ్రామస్తులు ఎండగడుతున్నారు. మండలంలోని వెల్ల గ్రామం మేజర్ పంచాయతీ ఎన్నికలు జరిగిన మొదటి ఏడాదిలో 2021–22, 2022–23 సంవత్సరాలకు గాను 14, 15 ఆర్థిక సంఘం నిధులు సుమారుగా రూ.కోటి 20 లక్షల వరకు మంజూరయ్యాయి. ఈ నిధులకు సంబంధించిన సర్పంచ్ వీరబోయిన సూరిబాబు గోల్‌మాల్ చేశారనే నిజాలు సమాచార హక్కు చట్టం ద్వారా గ్రామానికి చెందిన వాసంశెట్టి వీరవెంకటరమణ కోరగా వెలుగు చూశాయి. దీంతో పంచాయతీలో జరిగిన చెల్లింపుల్లో సుమారుగా రూ.15 లక్షల వరకు దుర్వినియోగం కాగా మరో రూ.15 లక్షల వరకు గోల్‌మాల్ అయినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిబంధనల ప్రకారం గ్రామ సర్పంచ్‌కు గానీ, పంచాయతీలో పనిచేసే ఉద్యోగస్తుల బ్యాంకు ఖాతాలకు గానీ పంచాయతీకి చెందిన నిధులు జమ చేయరాదు. కానీ 2022లో సర్పంచ్ వీరబోయిన సూరిబాబు బ్యాంకు ఖాతాకు రూ.1,35,000 కంప్యూటర్ ఆపరేటర్ అన్యం సత్యదేవి బ్యాంకు ఖాతాకు రూ.4,38,034, పంచాయతీ గుమాస్తా శ్రీవల్లి ఇందర బ్యాంకు ఖాతాకు రూ.3,55,313, శానిటరీ స్టాఫ్ జి.చిట్టిబాబు బ్యాంకు ఖాతాకు రూ.2,24,750, పంచాయతీ ఉద్యోగి మాగాపు శ్రీనివాసు బ్యాంకు ఖాతాకు రూ.34,745లు పంచాయతీ ఖాతా నుంచి జమ చేసినట్లు సమాచార చట్టం ద్వారా బయటపడింది. అయితే ఈ నిధులు మళ్లింపుపై గ్రామానికి చెందిన వాసంశెట్టి వీరవెంకటరమణ ఎన్‌ఫోర్స్‌మెంటు శాఖ అధికారులకు ఫిర్యాదు చేయగా జిల్లా కలెక్టర్‌ను విచారణ చేయాలని ఆదేశించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ రామచంద్రపురం ఎంపీడీవోను విచారణ చేయాలని ఆదేశించగా ఐదుగురు పంచాయతీ కార్యదర్శులతో కమిటీ వేసి విచారణ నిర్వహించారు.

అయితే ఈ విచారణలో పంచాయతీ సిబ్బంది బ్యాంకు ఖాతాలకు బదిలీ చేసిన సొమ్ములను సర్పంచ్ విత్‌డ్రా చేసి తీసుకున్నారని విచారణ అధికారులకు సిబ్బంది తెలిపారు. కానీ ఇప్పటివరకు సంబంధించిన విచారణ రిపోర్టును జిల్లా కలెక్టర్‌కు గానీ, ఎన్‌ఫోర్సుమెంటు శాఖకు గానీ గత రెండేళ్లుగా పంపలేదు. దీనిపై రెండు నెలల క్రితం వాసంశెట్టి వీరవెంకటరమణ తిరిగి ఉన్నతాధికారుల విచారణ రిపోర్టును ఇవ్వాలని సదరు నిధులు దుర్వినియోగంపై చర్యలు తీసుకోవాలని లేఖ రాసినా స్పందన లేదు.





వెల్ల పంచాయతీ కార్యాలయ భవనం

**నిధులు రికవరీ చేయాలి**



నిబంధనలకు విరుద్ధంగా వెల్ల గ్రామ పంచాయతీలో నిధుల మళ్లింపు జరిగింది. ఇదే విషయంపైనా జరిగిన అవినీతి అక్రమాలపై నేను సమాచార హక్కు చట్టం ద్వారా అడగటంతో నిజాలు వెలుగు చూశాయి. అధికారుల విచారణలో బయట పడ్డ విషయాలను తెలియజేసి సర్పంచ్ వీరబోయిన సూరిబాబుపై తక్షణం చర్యలు తీసుకోవాలి. పంచాయతీలో జరిగిన అవినీతి బాగోతంపై మరింత విచారణ చేస్తే చాలా విషయాలు వెలుగు చూసే అవకాశం ఉంది. కాబట్టి అధికారులు వెంటనే స్పందించి ప్రభుత్వ సొమ్ములను రికవరీ చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాను.

– వాసంశెట్టి వెంకటరమణ, గ్రామస్తుడు, వెల్ల

**విచారణ పూర్తయింది**

వెల్ల గ్రామ పంచాయతీలో నిబంధనలకు విరుద్ధంగా చెల్లింపులు జరిగాయంటూ వచ్చిన ఫిర్యాదులపై విచారణ పూర్తి చేయటం జరిగింది. ఎవరెవరి అకౌంట్లలోకి డబ్బులు జమ చేయబడ్డాయో వారితో పాటుగా సర్పంచ్, ఫిర్యాదు చేసిన వారి వివరణలను తీసుకోవటం జరిగింది. త్వరలోనే జిల్లా పంచాయతీ అధికారికి విచారణ రిపోర్టును అందిస్తాము.

– ఎ.రాజు డీఎల్పీవో

## కాంట్రాక్టర్ అవతారమెత్తిన సర్పంచ్

ఇదిలా పంచాయతీలో ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన సర్పంచ్ కాంట్రాక్టర్ అవతారమెత్తి నిధులు దోచేసుకున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామంలో జరిగిన 14, 15 ఆర్థిక సంఘం నిధులతో పాటుగా మరిన్ని అభివృద్ధి పనులు సీసీ డ్రైన్లు, సీసీ రోడ్లు వంటివి తానే కాంట్రాక్టర్‌గా అవతారమెత్తి నిధులు గోల్‌మాల్ చేసినట్లు తెలుస్తుంది. ఈ మేరకు డ్రైనేజీ శాఖకు చెందిన ఒక ఉన్నతాధికారి కూడా గ్రామంలో పనులు సర్పంచే కాంట్రాక్టర్‌గా పనిచేశారని ధ్రువీకరించటం కొసమెరుపు. కాగా గ్రామంలో జరిగిన అన్ని అభివృద్ధి పనుల్లోను సర్పంచ్ తనదైన శైలిలో దోపీడి చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీటన్నింటినీ తప్పించుకునేందుకు తాజాగా కూటమి నేతల ఆశీస్సుల కోసం తాపత్రయపడుతున్నారని తెలుస్తుంది. దీనికి అవునన్నట్లుగానే ఇటీవల గ్రామంలో స్థానిక మంత్రి సుభాష్ పాల్గొన్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పుట్టిన రోజు వేడుకల్లో సర్పంచ్ సూరిబాబు కూడా పాల్గొనడం విశేషమని గుసగుసలాడుకుంటున్నారు. కాగా ఇప్పటివరకు గ్రామ పంచాయతీకి ఎన్ని నిధులు మంజూరయ్యాయి, ఎంత ఖర్చు చేశారు, ఎంత వరకు గోల్‌మాల్ అయ్యాయి, అనే విషయాల నిగ్గు తేల్చాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు. గతంలో జరిగిన విచారణలో తేటతెల్లమైన విషయాల ద్వారా దుర్వినియోగం అయిన నిధులను రికవరీ చేయాలని, దానికి సంబంధించిన సర్పంచ్ ఇతరులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ఇటీవల పవన్‌కల్యాణ్ పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న సర్పంచ్ వీరబాబు

### వరద బాధితులకు సర్పంచ్ ఆర్థిక సహకారం



మంత్రి సుభాష్‌కు చెక్కు రూపంలో విరాళం అందజేస్తున్న సర్పంచ్ తిరుమల వేణి

కాజులూరు: విజయవాడ వరద బాధితుల సహాయార్థం బందనపూడి గ్రామ సర్పంచ్ దేగల తిరుమలవేణి రూ.లక్ష ఆర్థిక సహకారం అందించారు. ఈ మేరకు ఆదివారం సర్పంచ్ తిరుమలవేణి, ఆమె భర్త దేగల సత్యనారాయణ, ఎంపీటీసీ సలాది లక్ష్మణరావు తదితరులు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను కలసి చెక్కు రూపంలో విరాళం అందజేశారు. ఉప ముఖ్యమంత్రి, జనసేనాని పవన్‌కళ్యాణ్ పిలుపుమేరకూ తాము ఈ విరాళం అందించినట్టు సర్పంచ్ తిరుమలవేణి తెలిపారు. స్థానిక నాయకులు చందాల బాబి, తలాటం గౌతమ్, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

### సచివాలయ రహదారి అధ్వానం



ఛిద్రమైన వెదురుమూడి సచివాలయ రహదారి

కపిలేశ్వరపురం: మండలంలోని వెదురుమూడి సచివాలయం వీధి ఛిద్రమై అధ్వానంగా మారింది. లోతైన గుంతలు పడి ప్రయాణాలకు ప్రతికూలంగా ఉంది. ఆలమూరు, కపిలేశ్వరపురం మండలాల వాహనాలు ఈ రహదారి మీదుగా రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రజల సమస్యలు చెప్పుకునే వేదికైన సచివాలయానికి వచ్చేవారు గుంతల్లో నడుచుకుని వెళ్తున్నారు. ద్విచక్ర వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రహదారిని మెరుగుపర్చాలని కోరుతున్నారు.